చెత్తకు నిప్పు.. కాలుష్యం ముప్పు

- ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చితే గాలి కలుషితం
- ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం
- వాతావరణంలోకి కాలుష్య కారకాలు



డంపింగ్‌యార్డులో తగులబడుతున్న చెత్త

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతోంది. తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల అమ్మకాలు, వినియోగం యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడు, మద్యం షాపులు, కిళ్లీ బడ్డీలు, జ్యూస్ స్టాళ్లు, కర్రీ పాయింట్ల నుంచి ప్రతి నిత్యం టన్నుల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. వీటిని మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ నిప్పు పెడుతున్నారు. దీంతో వాతావరణంలో అత్యంత విషపూరిత కలుషితాలను నేరుగానే కలుపుతున్నారు.

ప్రమాదకరం

దాదాపు ప్రతి డంపింగ్‌యార్డులోనూ నిత్యం ప్లాస్టిక్ చెత్త తగలబడుతూనే ఉంటోంది. ఇది మనం పీల్చే గాలిని తీవ్ర స్థాయిలోనే కలుషితం చేస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 50 కంటే తక్కువగా ఉంటేనే ఆ గాలిని పీల్చుకోవడం ఆరోగ్యకరమైని అనేక నివేదికలు చెబుతున్నాయి. అయితే డంపింగ్ యార్డుల్లో నిత్యం ప్లాస్టిక్‌ను తగలబెట్టే ప్రాంతాల్లోనూ ఈ ఏక్యూఐ 70 నుంచి 119 వరకు ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా ప్రతి మొబైల్‌లోనూ ఈ ఏక్యూఐని చూపించే యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా పరీక్షిస్తే గాలి నాణ్యత ఆందోళనకరంగానే ఉంటోందని పలువురు చెబుతున్నారు. మరింత శాస్త్రీయ పరికరాల ద్వారా ఈ పరీక్షలు చేస్తే ఇంత కంటే ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని పంట పొలాలు ఉండే చోట్ల కూడా గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉంటోందంటే దీనికి ప్రధాన కారణంగా చెత్తను తగులబెట్టడమేనని పేర్కొంటున్నారు.

ప్రచారానికే పరిమితం

ప్లాస్టిక్ సమస్య నానాటికీ తీవ్రతరం అవుతున్నది. ఇది పర్యావరణానికే కాకుండా మనుషులకు, పశువులకు ప్రాణాంతకంగా మారింది. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి, మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో సైతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కాలువల నిర్వహణ సరిగా లేక, పూడిక తీత పనులు చేపట్టక దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందిపడుతుండగా.. ప్లాస్టిక్ సమస్య మరింత జటిలం చేస్తున్నది. ప్రభుత్వం, వీటి నిర్వహణ కోసం తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పట్టణంలో సాధారణ చెత్త కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉంటున్నాయి. పర్యావరణ పరిరక్షణపై పదే పదే అవగాహన కల్పిస్తున్నా, స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పేరుతో ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నా.. ప్రజల్లో మార్పు కనిపించడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పొడిచెత్తలో అత్యధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలేనని, వీటిని తగలబెట్టి చేతులు దులిపేసుకుంటున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను తగలపెట్టడం ద్వారా ఆరోగ్యం పైనే తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

ఘాటైన వాసనతో ఇబ్బందులు



ప్రతిరోజూ డంపింగ్‌యార్డుల నుంచి వెలువడే పొగతో ఘాటైన వాసన వస్తోంది. దీంతో ఊపిరి తీసుకోవడం కూడా ఇబ్బందికరంగా మారుతోంది. వాహనాలపై వెళ్లే సమయంలో ఊపిరి బిగబట్టి ప్రయాణిస్తున్నాం. డంపింగ్ యార్డు పరిసరాల్లోని పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో ప్రజలకు ఈ ఇబ్బంది తప్పడం లేదు.

– జి.మోహన్‌కుమార్, పాతరాయచోటి, రాయచోటి పట్టణం

ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి



ప్లాస్టిక్‌ను పూర్తిగా అరికట్టాలి. దానికి ప్రత్యామ్నాయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. తాము తెచ్చిన ప్లాస్టిక్ వస్తువులను చెత్తతో పాటు పడేస్తే. అది తిరిగి తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుందన్న రీతిలో చైతన్యపరచాలి. డంపింగ్ యార్డుల్లో చెత్తను తగులబెట్టడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలుగుతుంది.

– రవీంద్రవర్మ, బ్రాహ్మణవీధి, రాయచోటి పట్టణం

క్లుప్తంగా

వైభవంగా ప్రారంభమైన తిరునాల



పూజలందుకుంటున్న ఎల్లమ్మ తల్లి

చిన్నమండెం : మండల పరిధిలో చాకిబండ, కలిబండ గ్రామ పంచాయతీలలోని అమ్మవార్ల తిరునాల శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చాకిబండ గ్రామంలో కొలువై ఉన్న ఎల్లమ్మ తల్లి, కలిబండ గ్రామంలో కొలువై ఉన్న పాలేటమ్మ అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి నుంచి కస్తూరమ్మ ఉత్సవాలు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామంలో వెలసిన కస్తూరమ్మ తల్లి తిరునాల ఆదివారం, సోమవారం రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు మొదలవుతాయని వారు తెలిపారు. సోమవారం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి–వేంపల్లి రోడ్డు, కుర్నూతల క్రాస్ వద్ద వెలసిన మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌ను పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో వీరయ్య, నాగేంద్రబాబు, రామచంద్ర, గంగయ్య, దండే వెంకటరమణ, నరసింహరాజు, ఎం రవీంద్రారెడ్డి, చంద్ర, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



భావనారాయణ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్‌లో వెలసిన పద్మశాలీల కులదైవం భద్రావతి భావనారాయణ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం భావనారాయణ స్వామి మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి గరుడ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

పుల్లంపేట : పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి తన తల్లిదండ్రులు ముద్దా వెంకటసుబ్బారెడ్డి, ముద్దా మనోజరమ్మల జ్ఞాపకార్థం, అలాగే ఏవీ రామ్మోహన్ రెడ్డి తన తల్లిదండ్రులు ఆదిపరెడ్డి, నరసమ్మల జ్ఞాపకార్థం పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలం కావడంతో ఆసుపత్రికి వచ్చే వారి సౌకర్యార్థం చల్లని తాగు నీరును అందించడానికి ఈ వాటర్ కూలర్ అందజేశామని తెలిపారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, పార్థసారథిపాల్గొన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్‌లో దిట్ట చంద్రబాబు



గుండా సురేంద్ర, ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్

రాయచోటి జగదాంబ సెంటర్ : కుట్రలు, కుతంత్రాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కక్ష సాధింపులో భాగంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ సీఎం ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ వ్యవహారంలో నిరాధార ఆరోపణలతో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రజాక్షేత్రంలో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

20 నుంచి వీరాంజనేయ స్వామి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి

సిద్దవటం : మండలంలోని లింగంపల్లె గ్రామ శివారులో వెలసిన వీరాంజనేయ స్వామి తిరునాల మహోత్సవం ఈ నెల 20 వతేదీ నుంచి 22 వరకు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకుడు వెంటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ తిరునాల సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, ద్వజారోహణ, అంకురార్పణము, కలిశ స్థాపన, పంచామృతాభిషేకం, ఆకు పూజ, అర్చన మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాలు వంటి పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 21వ తేదీ పంచామృతాభిషేకం ఆకుపూజ, అర్చన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి వృషభ రాజములచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామని, గెలిచిన ఎద్దుల యజమానులకు బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్న ఐఈ కోఆర్డినేటర్ జనార్దన

రాయచోటి జగదాంబసెంటర్ : 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం జూన్ 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారి (ఐఈ కోఆర్డినేటర్) కొన్ని పాటి జనార్దన తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించి వారికి ప్రభుత్వం కల్పించే అన్ని సదుపాయాలను గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శనివారం రాయచోటి మండలంలో షేక్ మహమ్మద్ అనాస్, నూనె భవితలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారు. ప్రత్యేకావసరాల పిల్లలను భవిత కేంద్రానికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రత్యేకావసరాల పిల్లలకు వారి వైకల్య శాతాన్ని బట్టి రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలు ప్రతి నెలా అర్థిక సహాయంతో పాటు అలవెన్స్‌ల రూపంలో ఆర్థికంగా ప్రభుత్వం తోడ్పాటునిస్తుందని తెలిపారు. అలాగే ఫిజియోథెరపీ సేవలు కూడా అందిస్తుందని పరీక్షలలో స్క్రైబ్ సహాయంతో పాటు పాస్ మార్కులు కూడా తగ్గింపు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం



ఉత్తమ రైతులను సన్మానించిన ఏడీఏ నాగరాజ

సిద్దవటం : పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం అవుతుందని బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల కొరకు రైతులు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఏడీఏ నాగరాజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జనుము విత్తనాల కోసం రైతులు మొత్తాన్ని చెల్లిస్తే జనుము విత్తనాలను పంపిణీ చేస్తారన్నారు. మంగళవాండ్ల పల్లెలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. మంగళవాండ్లపల్లెలో నలుగురు ఉత్తమ రైతులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నక్క, సింగరయ్య, శంకర్ రెడ్డి, పద్మావతి, చంద్రకళ, షారోన్, రైతులు పాల్గొన్నారు.

గ్రీన్ షెడ్ నెట్‌ను ప్రారంభించిన మంత్రి



గ్రీన్ షెడ్ నెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్ వద్ద గ్రీన్ షెడ్ నెట్‌ను జిల్లా కలెక్టర్‌తో కలసి రాష్ట్ర రవాణ, క్రీడలు, యువజన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా వాహన దారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఎండల తీవ్రతను తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిగ్నల్స్ సమయంలో ఈ షెడ్‌లు ఎండతీవ్రత నుంచి కాపాడుతాయని చెప్పారు. అలాగే ప్రధానమై స్లమ్ ఏరియాలలో చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వృద్ధులు, మహిళలు ఎండ భారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, వివిధ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలపై సందిగ్ధత తొలిగించాలి

ఉపాధ్యాయుల బదిలీలపై నెలకొన్న సందిగ్ధతను తొలగించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస రాజు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయనను కలసి విషయంపై చర్చించారు. బదిలీల చట్టం ద్వారా రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడతున్న ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల కొరకు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించి బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోషియేషన్ నాయకులు బచ్చల శ్రీనివాసులు, కులశేఖర్‌రెడ్డి, గోవిందు, నాగరాజు, పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

రాయచోటి పట్టణంలోని మనం సేవా సభ్యులు చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర రవాణ, క్రీడల, యువజన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొనియాడారు. శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో "మనం ట్రస్ట్" వారి ఆధ్వర్యంలో 3 ఆక్సిజన్ అంబులన్స్‌లు, ఐసీయూ వెంటిలేటర్ అంబులెన్స్, 8 ఫ్రీజర్ బాక్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ట్రస్టు సభ్యులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మనం ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సౌమ్యనాథ అన్నదాన ట్రస్టుకు విరాళం



అన్నదాన ట్రస్ట్ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

నందలూరు : సౌమ్యనాథ సేవా ట్రస్ట్ వారి శాశ్వత అన్నదాన పథకానికి రాజంపేటకు చెందిన నిట్టూరు బాబు, మున్ని దంపతులు రూ.40,116 కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సభ్యులు లంకయ్య గారి సుబ్బరామయ్యకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా చక్రాల రామసుబ్బన్న మాట్లాడుతూ అన్నదాన ట్రస్ట్‌కు ఆర్థికంగా సహకరించిన దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం భక్తుల కోసం వారానికి రెండు రోజుల పాటు శుక్ర, శనివారాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నిత్యాన్నదానం కోసం కార్యాచరణ రూపొందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చక్రాల సాయి, పెంచలయ్య, వరదయ్య, శివ, శ్రీను పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్‌లో పని చేస్తున్న భద్రతా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కడప జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ ధర్మతేజ తెలిపారు. శనివారం వీఅండ్ఎస్ఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జోన్ పరిధిలోని హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తంగా ఉంటూ సంస్థ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



డాక్టర్ శ్రేయ

పెనగలూరు : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పెనగలూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్రేయ తెలిపారు. శనివారం ఆమె పెనగలూరు ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

భాకరాపేటలో వాహనాల తనిఖీ



భాకరాపేట చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఒంటిమిట్ట సీఐ బాబు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్ పోస్టు సమీపంలో శనివారం సాయంత్రం సీఐ బాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే ఈ వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా దరించాలని సూచించారు ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎంపీ మేడా రఘునాథరెడ్డి



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎంపీ మేడా, అనీల్‌కుమార్‌రెడ్డి

రాజంపేట రూరల్ : ఆధ్యాత్మిక మార్గంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డి అన్నారు. మ్మడి జిల్లాలో ప్రముఖ వైష్ణవ దేవస్థానంగా వెలుగొందుతున్న భువనగిరి మండల పరిధిలోని భువనగిరిపల్లిలో వెలసిన భువనగిరి లక్ష్మీనరసింహస్వామిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిలతో కలిసి ఎంపీ మేడా రఘునాథరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఎంపీ మేడాకు ఆలయ ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు, ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

కాశీ విశ్వనాథ హిందూ స్మశాన వాటిక కమిటీ ప్రతినిధులు ఎంపీ మేడా రఘునాథరెడ్డిని మేడా భవన్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. కాశీ విశ్వనాథ హిందూ స్మశాన వాటిక సుందరీకరణకు సహకరించిన ఎంపీ మేడా రఘునాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కాశీ విశ్వనాథ హిందూ స్మశాన వాటిక కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి మహాప్రభో!



నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధి కూలీలు

గాలివీడు : గాలివీడు మండల పరిధి గరుగుపల్లి గ్రామంలో ఉపాధి పనులు కల్పించండి మహాప్రభో అంటూ ఉపాధి కూలీలు ఉపాధి పనులు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి ప్రారంభమైనప్పటి నుంచి గ్రూపుల వారీగా ప్రతీ ఒక్కరికీ ఉపాధి పని కల్పించడమే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం యొక్క లక్ష్యమని, ఉపాధిలో ఉన్న విధి విధానాలను పక్కనబెట్టి కేవలం అధికార దర్పంతో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నామని తమకు ఉపాధి పనులు కల్పించలేదని కూలీలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపైన ఉన్నతాధికారులు, మండలస్థాయి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తాము వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ నాయకులు అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఈ విధంగా మా గ్రామంలో ఉపాధి పనులు కల్పించడంలో కక్షసాధింపులకు పాలడ్డారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పీడీ వెంకతరత్నం దష్టికి తీసుకెళ్లగా ఉపాధి హామీ పనులు కూలీల హక్కు అని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. ఉపాధిలో రాజకీయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రతీ కూలీకి పని కల్పిస్తామని తెలిపారు. మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసి ప్రతి కూలీకి న్యాయం చేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు
- స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన



రాజంపేట: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



లక్కిరెడ్డిపల్లి: మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గాలివీడు: వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్యురాలు



నందలూరు : మొక్కలు నాటుతున్న అధికారులు

రాజంపేట : పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. రాజంపేట పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత, పచ్చదనం పెంపొందించడంపై నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం కొత్తబస్టాండు వద్ద స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట పట్టణంలో మున్సిపాలిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనరు కోరారు. అదే విధంగా మూగజీవాల కోసం తాగునీటి కుంటలు ఏర్పాటు చేశామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మద్దిరేవుల గ్రామ పంచాయతీ ఈడిగపల్లి, నెహ్రూ నగర్ సోమలవాండ్లపల్లిలో వైద్య సిబ్బంది ప్రత్యేక మెడికల్ క్యాంపును నిర్వహించి గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేయించి, రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛతపై ర్యాలీ చేసి, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రజనీశ్ రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది నందినీ, లావణ్య, వైద్య సిబ్బంది విజయ కుమారి, సెక్రటరీలు వేణుగోపాల్, గిరిబాబు, అరుణ పాల్గొన్నారు.

పుల్లంపేటలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర

పుల్లంపేట : పుల్లంపేట గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పుల్లంపేట నాలుగు రోడ్ల కూడలి వరకు బీట్ ద హీట్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. పుల్లంపేట గ్రామ పంచాయతీలోని బస్టాండు వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పుల్లంపేట మండల ప్రత్యేకాధికారి వై. శ్రీధర్‌రెడ్డి, పుల్లంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.ముత్తయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దినేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

గాలివీడు : పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సందర్భంగా ఎంపీడీఓ జవహర్ బాబుతో కలసి అన్ని గ్రామ పంచాయతీలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు, గోరాన్ చెరువు, అరవీడు, గాలివీడు గ్రామాల్లో వైద్య శిబిరాలు, పశువులకు నీటి తొట్లు ఏర్పాటు, పక్షులకు నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ పీఆర్ జేఈలు, ఏఓ జాబీర్ అహమ్మద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు : స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్వర్ణాంధ్రను సాధించవచ్చు అని మండల ప్రత్యేకాధికారి రామచంద్రనాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అన్ని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీడీఓ ఆర్.రాధాకృష్ణంరాజు, డిప్యూటీ ఎంపీడీఓ సునీల్‌కుమార్, కార్యాలయ పరిపాలన అధికారి పి.హబీబుల్లాఖాన్, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ రామచంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా వెలుగు సంఘాల మహిళలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చదనంతో పరిపూర్ణ ఆరోగ్యం

వీరబల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని స్పెషల్ ఆఫీసర్ మైతిలి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యానారాయణ, ఎంపీడీఓ నూర్జహాన్‌లు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇళ్లలోని వ్యర్థాలను, అలాగే చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయకూడదన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి ఎదుట రెండు మొక్కలు నాటి వాటిని పరిరక్షించినట్లైతే పచ్చదనానికి చల్లటి వాతావరణంతోపాటు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు, వెలుగు సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.